## క్లుప్తంగా

### హక్కుల కోసం పోరాడుదాం

**తిరుపతి కల్చరల్:** కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తెలిపారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేతలు వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, రామకృష్ణ, పార్థసారథి, బుజ్జమ్మ, నాగ వెంకటేష్ పాల్గొన్నారు.

### సన్మానం

**చంద్రగిరి:** శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో నూతనంగా బాధ్యతలను స్వీకరించిన అధికారులను విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుధవారం డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫసర్ ఆర్‌వీ సురేష్ కుమార్, విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫసర్ వైకుంఠ రావును ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు. రాయలసీమ బీసీ విభాగం అధ్యక్షులు విజయ్, గిరి నాయక్, ముస్తఫా, చిద్విలాస్, పార్థసారథి, ధనుంజయులు, మధు ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

### సీడ్ బాల్స్ చల్లిన విద్యార్థులు

**పాకాల:** ఊట్లవారపల్లెకు సమీపంలోని ఆనందగిరి కొండపై ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు సీడ్ బాల్స్‌ను చల్లారు. బుధవారం కళాశాల ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు సమక్షంలో పాకాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీడ్ బాల్స్‌ను చల్లే కార్యక్రమాన్ని నిర్వహించామని, వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కెఎస్.తులసీరామన్, రీజినల్ చైర్మన్ జి.రామయ్య, అధ్యాపకులు రమేష్‌నాయుడు, రూపేష్, రెడ్డిప్రతాప్ పాల్గొన్నారు.

### సీఐటీయూ జిల్లా నూతన కమిటీ



ఎస్.జయచంద్ర, టిసుబ్రమణ్యం, ఈఎస్.కుమార్

**తిరుపతి కల్చరల్:** సీఐటీయూ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.జయచంద్ర, ప్రధాన కార్యదర్శిగా టి.సుబ్రమణ్యం, కోశాధికారిగా ఈఎస్.కుమార్, ఉపాధ్యక్షులుగా కందారపు మురళి, జి.బాలసుబ్రమణ్యం, వి.నాగరాజు, కేఎస్ ప్రసాద్‌రావు, పి.రామకృష్ణ, ఎన్.వాణిశ్రీ, చెంగయ్య, వేణుగోపాల్, కార్యదర్శులుగా ఆర్.లక్ష్మి, ఆర్.వెంకటేష్, గురవయ్య, నాగ వెంకటేష్, పి.బుజ్జి, లక్ష్మయ్య, రాజేశ్వరితో పాటు మరో 58 మంది కమిటీ సభ్యులను ఎన్నికయ్యారు.

### ఉద్యోగ చట్టం అమలు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు మాసుమయ్య, నేతలు

**తిరుపతి కల్చరల్:** రాష్ట్రంలో ఉద్యోగ చట్టం అమలు చేసి, ప్రతి నిరుద్యోగికీ ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని భారతీయ దేశభక్తుల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు, నాయవాది పోతులూరి మాసుమయ్య డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉద్యోగ చట్టం సిద్ధాంతం డిమాండ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో నిరుద్యోగ సమస్య అత్యంత పెద్ద సమస్యగా మారిందని, ఈ నేపథ్యంలో నిరుద్యోగ సమస్యకు ఉద్యోగ చట్టం సిద్ధాంతం ఒక్కటే మార్గమన్నారు. తమ ఐక్యవేదిక ఉద్యోగ చట్టం సిద్ధాంతాన్ని అమలు చేయాలని, గత 25 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోలేదన్నారు. ఐక్య వేదిక నేతలు విక్రమ్ రాథోడ్, రాజు, సౌందర్య నాయక్, సుధాకర్, సురేష్ నాయక్, బ్రహ్మయ్య, అరవింద్ పాల్గొన్నారు.

### పేదలకు అల్పాహారం వితరణ



అల్పాహారం వితరణ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**తిరుపతి కల్చరల్:** లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో పేదలకు ఉచితంగా అల్పాహారం వితరణ చేశారు. అనంతరం గర్భిణులు, వారి సహాయకులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. దాత టీవై ఆరాధ్య, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఎం.భాస్కర్, అధ్యక్షుడు బండి మధుసూధన్‌రెడ్డి, కార్యదర్శి చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్ పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచ మహిళా రైతుదినోత్సవం

**భాకరాపేట :** చిన్నగొట్టిగల్లు మండలంలోని జగనన్న సమావేశ మందిరంలో ప్రపంచ మహిళా రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధికారులందరూ సమాజంలో మహిళల అభివృద్ధి గురించి, మహి

# అంతస్తులు కట్టారు.. సెప్టిక్ ట్యాంక్ విస్మరించారు!

- గుట్టుగా స్వర్ణముఖిలోకి మురుగునీటి మళ్లింపు
- దుర్గంధభరితమైన స్వర్ణముఖి నది

**సాక్షి, టాస్క్‌ఫోర్స్:** తిరుపతి రూరల్ మండలంలోని స్వర్ణముఖి నదీ పరివాహక గ్రామ పంచాయతీల్లో భారీ భవంతులు నిర్మిస్తున్నారు. పలు చోట్ల అపార్ట్‌మెంట్లు కట్టి వందలాది మందికి ఆవాసాలు కేటాయిస్తుండగా అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే మురుగు నీటిని గుట్టుగా స్వర్ణముఖిలోకి వదిలేస్తున్నారు. వరదలతో కళకళలాడాల్సిన స్వర్ణముఖి మురుగునీటితో కంపు కొడుతోంది. నదిలో పారే కలుషితమైన మురుగునీటిని గొర్రెలు, మేకలు, పశువులు తాగడంతో మృత్యువాత పడుతున్నాయని పలువురు పశువుల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకోని పంచాయతీ అధికారులు**

తుడా నుంచి అనుమతులు పొంది భారీ భవంతులు కడుతున్నప్పటికీ ఆ భవనాల నుంచి బయటకు వచ్చే వ్యర్థాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు బాధ్యత ఉంటుంది. ఆ అపార్ట్‌మెంట్లపై పెత్తనం పంచాయతీ కార్యదర్శుల చేతిలో ఉంటుంది. అయితే భవన యజమానులు పంచాయతీ కార్యదర్శులను లెక్క చేయకుండా విచక్షణా రహితంగా మురుగునీటిని నదిలోకి వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు వచ్చే మురుగునీటికి కాలువలు తవ్వాలన్నా, వాటిని స్టోరేజీ చేయాలన్నా ముందుగా పంచాయతీ కార్యదర్శి అనుమతి తీసుకోవాలి. అయితే అందుకు పూర్తి భిన్నంగా చిగురువాడ పంచాయతీలోని అపార్ట్‌మెంట్ యజమానులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా చిగురువాడ పంచాయతీలోని వైఎస్సార్ కాలనీ వద్ద ఓ అపార్ట్‌మెంట్ యజమాని గుట్టుగా కాలువ తవ్వి స్వర్ణముఖి నదిలోకి మురుగు నీటిని మళ్లించే పనులు చేపట్టడంతో కాలనీ వాసులు అడ్డుకున్నారు.



పంచాయతీ అనుమతి లేకుండా అపార్ట్‌మెంట్ యజమాని స్వర్ణముఖి నదిలోకి తవ్వుతున్న మురుగు కాలువ, (ఇన్‌సెట్) కాలువ పనులు చేస్తున్న కూలీ

**అధికార మదమా..? లెక్క లేనితనమా..?**

అక్రమంగా మురుగునీటిని స్వర్ణముఖి నదికి మళ్లించినట్లు తెలుసుకున్న చిగురువాడ పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి అక్కడకు చేరుకుని అపార్ట్‌మెంట్ యజమానిని పనులు ఆపాలని అడ్డు చెప్పగా ఆమెపై దురుసుగా మాట్లాడినట్లు సమాచారం. తుడా అప్రూవల్ ఇచ్చిన తరువాత పంచాయతీ కార్యదర్శిగా మీకేం.. సంబంధం.. పనులు ఆపేది లేదు.. ఎవరికీ సమాధానం చెప్పాల్సిన పనిలేదు.. అంటూ ఆ భవన యజమాని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు సమాచారం. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు ఆ అపార్ట్‌మెంట్ యజమానికి అండగా నిలవడంతోనే అలా మాట్లాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై చిగురువాడ పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మిని వివరణ కోరగా అపార్ట్‌మెంట్ యజమాని తన మాటలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న మాట వాస్తవమేనని, అందుకే గురువారం నోటీసు అందజేస్తున్నామన్నారు. నోటీసుకు సమాధానం రాని పక్షంలో ఆ కాలువను ధ్వంసం చేయడం జరుగుతుందన్నారు.

## ధన్వంతరి జయంతిని జయప్రదం చేయండి

**తిరుపతి కల్చరల్:** గాంధీ భవన్ ఆవరణలో ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే ధన్వంతరి జయంతి వేడుకలకు జిల్లాలోని నాయీ బ్రాహ్మణులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తిరుపతి నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల పాటి బుజ్జిబాబు పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధన్వంతరి జయంతి వేడుకల్లో భాగంగా గాంధీ రోడ్డులోని మంగళ భజన మందిరం నుంచి గాంధీ భవనం వరకు మంగళవాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం



మాట్లాడుతున్న ఆవుల పాటి బుజ్జిబాబు

ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వంద మంది మహిళలకు పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణ నగర యువజన అధ్యక్షుడు మునిశేఖర్, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, జనార్దన్, వెంకటలక్ష్మి, గోపి, లక్ష్మీదేవి, తదిరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్

**తిరుపతి అర్బన్:** ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జిల్లాలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలు ప్రారంభించినట్లు కలెక్టర్ వెల్లడించారు. పరిశ్రమల్లో మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, స్థిరమైన అభివృద్ధి చర్యలు, పరిశ్రమలు – పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాలు, శుభ్రత – పారిశుద్ధ్య డ్రైవ్, మొక్కల నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ చరణ్ రుద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన

**తిరుపతి కల్చరల్:** జనశిక్షణ సంస్థ, టాటా కేర్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థ కార్యాలయంలో బుధవారం మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టాటా క్యాన్సర్ కేర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్, డాక్టర్ బి.సుధాకర్‌రెడ్డి, అనంత పద్మనాభం, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న టాటా క్యాన్సర్ కేర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు

## చట్టాలతో మహిళలకు రక్షణ



**తిరుపతి సిటీ :** చట్టాలతో పిల్లలు, మహిళలకు రక్షణ ఉంటుందని ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సాయి సుజాత తెలిపారు. బుధవారం అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ కౌన్సిలర్ పి. రోజా రమణి, డి.జాహ్నవి, డాక్టర్ డి.రమణ డాక్టర్ వి.జగదీశ్వరి డాక్టర్ డి.రాజరాజేశ్వరి డాక్టర్ పి.సునీత, నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి ఉమాదేవి, భానుమతి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో రెడ్‌చెర్రీస్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్, ఉపాధ్యాయులు

**తిరుపతి సిటీ:** స్థానిక రెడ్ చెర్రీస్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి కే తమన్ రాష్ట్రస్థాయిలో జరిగిన గోల్ షాట్ బాల్ పోటీల్లో పాల్గొని, ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి విద్యార్థిని అభినందించి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అకడమిక్ విద్యతో పాటు క్రీడలు పెద్ద పీట వేసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

## గాయని బాలసరస్వతీదేవి మృతి బాధాకరం

**తిరుపతి కల్చరల్:** తొలితరం ప్రముఖ నేపథ్య గాయని రావు బాలసరస్వతిదేవి (97) మృతి బాధాకరమని సాహితీవేత్త సాకం నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె వృద్ధాప్యం కారణంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో బుధవారం మృతి చెందారు. శ్రీకాళహస్తి ప్రాంతం కొలంకి సంస్థానం రాజావారి భార్య, తిరుపతి జిల్లా వెంకగిరికి చెందిన ఈమె గొప్ప గాయనిగా ప్రసిద్ధి చెందింది. భాషాభిమాని, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో 2007లో తిరుపతిలో నిర్వహించిన తెలుగు భాషోత్సవాల్లో సత్కరించి అభినందించారు.



తెలుగుభాషోత్సవాల్లో సన్మానం అందుకున్న బాలసరస్వతీదేవి(ఫైల్)

## ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులు



**తిరుపతి కల్చరల్:** ఇంటర్మీడియట్ బోర్డు ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన ఏ.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలోని ఎన్జీఓ హోమ్‌లో ఏపీ ఎన్జీఓ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నిక నిర్వహించారు. శ్రీనివాసులు రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో జిల్లాలోని సంఘం ప్రతినిధులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం



అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న నాయకులు



స్ప్రింగ్‌డేల్‌లో..

**తిరుపతి గాంధీ రోడ్:** దేశ మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మెన్ డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలను తిరుపతిలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద బీజేపీ సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. చిన్నతనంలో అనేక కష్టాలను అనుభవించి, ఉన్నత చదువులు అభ్యసించారని గుర్తు చేశారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తగా దేశ శాస్త్ర సాంకేతిక రంగంలో విశేష సేవలను అందించి మిస్సైల్స్ తయారీలో పాలుపంచుకున్నారని చెప్పారు. అలాగే ఉపగ్రహాల తయారీలో అబ్దుల్ కలాం పాత్ర కీలకమైనదని కొనియాడారు. ఆయన సేవలను మెచ్చిన భారత ప్రభుత్వం ఆయనకు రాష్ట్రపతి పదవి ఇచ్చిందన్నారు. రాష్ట్రపతి హోదాలో కూడా అబ్దుల్ కలాం అతి సాధారణ జీవితం గడిపి దేశానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి, తమ్మిశెట్టి చంద్రశేఖర రాయల్, జయంత్ కుమార్, అన్నా రెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**కరకంబాడి రోడ్డులో..**

**తిరుపతి మంగళం :** కరకంబాడిరోడ్డులోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్‌లో తిరుపతి సిటీ చాంబర్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, మహిళా వర్సిటీ వీసీ ఉమ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేశభక్తితో అంకితభావంతో నిరాడంబర జీవితం గడిపిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలామ్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. సిటీ చాంబర్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, వ్యవస్థాపక కార్యదర్శి వై.షణ్ముగం మాట్లాడుతూ పిల్లల్లో జాతీయతా భావం, విజ్ఞాన స్ఫూర్తి నింపిన మహనీయులు కలామ్ అని వెల్లడించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థులు కలామ్ మాస్క్‌లు ధరించి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో విద్యాసంస్థ అధినేత కేఎస్ వాసు, ప్రిన్సిపల్ అనురాధ, సాంబశివారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్లు కరుణానిధి, స్వరాజ్యలక్ష్మి, స్టాన్లీ జయకుమార్ పాల్గొన్నారు.

**చంద్రగిరిలో..**

**చంద్రగిరి:** సామాన్య కుటుంబం నుంచి జీవితాన్ని ప్రారంభించి, దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి చేపట్టడంతోపాటు రక్షణ రంగంలో మిస్సైల్ మెన్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటి తరం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఎంఈఓ లలిత కుమారి అన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని, చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి ఎంఈఓతోపాటు హెచ్‌ఎం వెంకటరమణరెడ్డి, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య, ఇంపాక్ట్ రీజినల్ క్లబ్ ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంపాక్ట్ రీజినల్ ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం,ఇంపాక్ట్ ట్రైనర్ మాధవి, నల్లం నరేంద్ర పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంఈఓ లలిత కుమారి, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంకయ్య

## 22 నుంచి కార్తీకమాస హోమాలు

**తిరుపతి కల్చరల్:** పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని లోకకల్యాణం కోసం శ్రీకపిలేశ్వరాలయంలో ఈనెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు నెల రోజుల పాటు విశేష పూజ, హోమాలు జరుగనున్నాయి. ఈ నెల 22వ తేదీన హోమ మహోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టనున్నారు. ఈనెల 22, 23వ తేదీల్లో మొదట గణపతి హోమం, 24 నుంచి 26వ తేదీ వరకు సుబ్రమణ్యస్వామి హోమం, 27న శ్రీదక్షిణామూర్తి స్వామి హోమం, 28న శ్రీనవగ్రహ హోమం జరుగనున్నాయి. 29న శ్రీకాలభైరవ స్వామి వారి హోమం, ఈనెల 30 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు శ్రీకామాక్షి అమ్మవారి చండీహోమం, నవంబర్ 8 నుంచి 18వ తేదీ వరకు శ్రీకపిలేశ్వరస్వామి వారి హోమం(రుద్రహోమం), 19న ధర్మశాస్త్ర హోమం, 20న శ్రీచండికేశ్వరస్వామివారి హోమం, త్రిశూలస్నానం, పంచమూర్తుల తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ హోమాల్లో భాగంగా ఈనెల 27న శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారి కల్యాణం జరుగనుంది. గృహస్తులు ఇద్దరు రూ.500 చెల్లించి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. ఇందులో పాల్గొన్న వారికి ఒక ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. అలాగే నవంబర్ 18న మాస శివరాత్రి నాడు శ్రీశివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనదలచిన గృహస్తులు రూ.500 చెల్లించి ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## రూ.1.30 కోట్లతో ప్రసూతి వైద్యశాల అభివృద్ధి

**తిరుపతి తుడా:** రూ.1.30 కోట్లతో ప్రసూతి వైద్యశాల అభివృద్ధి పనులు చేపట్టడానికి వైద్యశాల కమిటీ అమోదం తెలిపింది. స్థానిక ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల కమిటీ సమావేశం బుధవారం ఎస్వీ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ కోచైర్మన్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కన్వీనర్ సభ్యుడు డాక్టర్ జి ప్రమీలాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో రూ.1.30 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఇందులో జనరేటర్ సిస్టం ఏర్పాటుకు రూ.11లక్షలు, రోగుల కోసం ఎలక్ట్రికల్ వాహనాలు, రోగుల సహాయకులకు 25 సిమెంట్ బెంచ్‌ల ఏర్పాటు, అలాగే మరుగుదొడ్ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, రక్త పరీక్షల నిర్వహణకు ఆటోమేటిక్ అనలైజర్ ఏర్పాటు, బెడ్‌షీట్లు, శాశ్వత షెడ్లు, డంపింగ్ యార్డుల ఏర్పాటుకు, రోడ్డుకు ఇరువైపులా గేట్ల ఏర్పాటు, 25 వీల్ చైర్లు, 10 స్ట్రెక్చర్‌ల కొనుగోలుకు నిధులు కేటాయిస్తూ కమిటీ ఆమోదం తెలిపింది.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

## వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

**తిరుపతి అర్బన్:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలనే అంశాన్ని అంగన్‌వాడీ పాఠశాలల్లో పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు సైతం అందరికీ చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. అనంతరం చేతులను శుభ్రం చేసుకోవడానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

## ఘనంగా ఆయుధ పూజ

**తిరుపతి తుడా:** నగరపాలక కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా ఆయుధపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్. మౌర్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్, అధికారులు పాల్గొని, వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా నగరపాలక సంస్థలో అన్ని వాహనాలు, రూ.3కోట్లతో కొనుగోలు చేసిన వాహనాలకు పూజలు చేసి, ప్రారంభించామని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కమిషనర్, ఎమ్మెల్యే, అధికారులు

## 11వ రోజు కొనసాగిన పీహెచ్‌సీ వైద్యుల నిరసన

**తిరుపతి తుడా:** పీహెచ్‌సీ వైద్యులు తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరుతూ గత 11 రోజులుగా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. దీంతో వైద్యులు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు నల్లరిబ్బన్లతో విధులను బహిష్కరించి ధర్నా చేపట్టారు. దీంతో జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో వైద్య సేవలు స్తంభించిపోయాయి. దీంతో పేద ప్రజలకు వైద్య సేవలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం నిరవధిక సమ్మెలో పాల్గొన్న పలువురు వైద్యులకు ప్రజా సంఘాలు, పలువురు వైద్యులు సంఘీభావం వ్యక్తం చేశారు.

## కమిషనర్‌తో జిల్లా జేశాప్ క్రికెట్ జట్టు భేటీ

**తిరుపతి తుడా:** జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జేశాప్) తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు క్రీడాకారులు బుధవారం సాయంత్రం నగరపలక సంస్థ కమిషనర్ మౌర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ – 2025 విజేతగా నిలిచిన ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లా జట్టును అభినందించారు. టోర్నీలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పాల్గొన్న 16 జట్లలో తిరుపతి జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేశాప్ జిల్లా అధ్యక్షులు విజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, జిల్లా జట్టు కెప్టెన్ శ్రీనివాసులు, క్రీడాకారులు మనోహర్, జగదీష్, సురేష్, శేఖర్, తుకారం, సతీష్,శ్రీనివాసులు, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జేశాప్ జిల్లా జర్నలిస్ట్ జట్టును అభినందిస్తున్న కమిషనర్ మౌర్య

## ప్రేక్షకులు మెచ్చే సినిమాలే లక్ష్యం

–సినీ హీరో కిరణ్ అబ్బవరం

**తిరుపతి కల్చరల్:** తెలుగు ప్రేక్షకుల అభిరుచులు, భావోద్వేగాలు ప్రతిబింబించేలా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా సినిమాలు తీయాలని లక్ష్యంగా పెట్టుకున్నానని యువ సినిమా హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తున్నారని, వారి ఆకాంక్షలకు తగ్గట్టు కుటుంబ సమేతంగా చూడదగిన సినిమాలను తీసి, వారి నుంచి మరింత మెప్పును పొందేందుకు ప్రయత్నిస్తానన్నారు. ప్రతి ఒక్కరికీ నచ్చేలా రూపొందించిన చిత్రం కే-ర్యాంప్ ఈనెల 18వ తేదీన విడుదల కానుందని తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తిలకించి, ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సినిమా తన కేరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.



మాట్లాడుతున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం

### 33 మందికి జరిమానా

**తిరుపతి లీగల్:** మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 33 మందికి ఒక్కొక్కరికి రూ.10 వూలే వంతున జరిమానావిధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు చేసి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.